క్లుప్తంగా

బడ్డీలు తొలగించారు

సాక్షి ఎఫెక్ట్

మధురానగర్(విజయవాడ సెంట్రల్): రామకృష్ణాపురం దేవీనగర్ రోడ్డులో ఇటీవల ఏర్పాటు చేసిన బడ్డీలను శనివారం నగరపాలకసంస్థ అధికారులు తొలగించారు. ఇక్కడ ఇటీవల లక్షలాది రూపాయల వ్యయంతో బుడమేరు పక్కన ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. అయితే ఫెన్సింగ్ పక్కనే ఆక్రమణలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవటం లేదు. దీంతో స్థానికులు పడుతున్న సమస్యలను వివరిస్తూ సాక్షి శనివారం ఫెన్సింగ్ సరే.. ఆక్రమణల మాటేమిటి..? శీర్షికన కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన వీఎంసీ అధికారులు బడ్డీలను తొలగించారు. ఇంత వరకుబాగానే ఉంది. కానీ ఫెన్సింగ్ లోపల ఉన్న పశువులను మాత్రం అలాగే వదిలివేయటం అధికారుల బాధ్యతారాహిత్యాన్ని తెలియజేస్తోందని స్థానికులు అంటున్నారు.

రూ.67.49 లక్షలతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

మధురానగర్(విజయవాడసెంట్రల్): నియోజకవర్గంలోని 28వ డివిజన్ శ్రీనగర్ కాలనీ 4, 5వ రోడ్డులలో రూ.67.49 లక్షలతో సీసీ రోడ్డు పనులకు శనివారం ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు స్థానిక కార్పొరేటర్ వీరమాచనేని లలితతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ తాము ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించటానికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నామన్నారు. ముఖ్యంగా మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. సాధ్యమైనంత త్వరలోనే రోడ్డు పనులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో నాయకులు వి.కిషోర్, దేవరపు మాల్యాద్రి, పి.రామకృష్ణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మహాకుంభాభిషేక మహోత్సవాలు ప్రారంభం

విజయవాడ కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో పున్నమ్మతోటలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో 12 సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే మహాకుంభాభిషేక మహోత్సవాలు శనివారం వైఖానస ఆగమోక్తంగా ప్రారంభమయ్యాయి. టీటీడీ ఆస్థాన అర్చక స్వాములు, వేదపండితుల సమక్షంలో అభిజిత్ ముహూర్తంలో రుత్వికులకు ఆచార్యవరణంతో కార్యక్రమాలకు అంకురార్పణ జరిగింది. యజ్ఞశాల శాంతి కోసం వాస్తు హోమం అకల్మష హోమం, మృత్సంగ్రహణం నిర్వహించారు. అర్చక స్వాములు ఆర్.బాలమురళీ కృష్ణ అయ్యంగార్, శశికిరణ్ క్రతువు నిర్వహణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎస్వీఎస్ఎస్ టెంపుల్స్ సూపరింటెండెంట్ మల్లికార్జునరావు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ లలితా రమాదేవి లలితా దేవి, మాకినేని విజయకుమార్, ఆర్.సంజీవరెడ్డి, ఎస్.వేణు పాల్గొన్నారు.

స్టాండింగ్ కమిటీ సభ్యులతో మేయర్ సమావేశం



పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని మేయర్ చాంబర్‌లో శనివారం నూతనంగా ఏర్పడిన స్టాండింగ్ కమిటీ సభ్యులతో మేయర్ రాయన భాగ్యలక్ష్మి సమావేశం నిర్వహించారు. ఈ నెల 28న జరగబోవు స్టాండింగ్ కమిటీ సమావేశం ఎజెండాపై ఈ సమావేశంలో సమీక్షించారు. నూతనంగా ఏర్పడిన స్టాండింగ్ కమిటీ సభ్యులను మేయర్ సన్మానించారు. సమావేశంలో స్టాండింగ్ కమిటీ సభ్యులు అలంపూర్ విజయలక్ష్మి, మహమ్మద్ రెహానా నహీద్, పుప్పల నరస కుమారి, శీరంశెట్టి పూర్ణచంద్రరావు, షేక్ రహమతున్నీసా, వుద్దంటి సునీత పాల్గొన్నారు.

ముస్లిం యువతి వివాహానికి సరుకులు అందజేత

పాయకాపురం(విజయవాడరూరల్): కండ్రికలో పేద ముస్లిం యువతి వివాహానికి అవసరమైన 15వేల రూపాయల విలువ చేసే నిత్యావసర సరుకులను ఆజాద్ ముస్లిం కమిటీ పంపిణీ చేసింది. కండ్రిక కార్యాలయంలో శనివారం షేక్ జరీనా వివాహం సందర్భంగా ఆమె కుటుంబ సభ్యులకు నిత్యావసర సరుకులను ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా అందజేశారు. కార్యక్రమంలో కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మౌలానా షేక్ సాజిద్ అలీ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండి కాలేషా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఎరైజ్ అండ్ షైన్ సొసైటీ ఆధ్వర్యంలో వాంబేకాలనీలోని జంధ్యాల దక్షిణామూర్తి మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన 25 మంది నిరుపేద విద్యార్థులకు శనివారం ఉపకార వేతనాలు, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. సంస్థ వ్యవస్థాపకులు కె.రవి, జోనా, స్థానిక కార్పొరేటర్ కంచి దుర్గ , దాతలు డీఎస్ చలం, శివకోటేశ్వరరావు, రామారావు, స్థానిక పెద్దలు కంచి ధనశేఖర్, రాము, పాఠశాల హెచ్‌ఎం జె.శేఖర్‌బాబు పాల్గొన్నారు.

సమస్యల సాలెగూళ్లు

- ప్రభుత్వ సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో నామమాత్రంగా సదుపాయాలు
- బెడ్‌షీట్లు, కార్పెట్లు అందజేయని ప్రభుత్వం
- దోమల బెడదతో ఇబ్బంది పడుతున్న విద్యార్థులు
- లక్షలు ఖర్చు చేసి మరమ్మతు చేసి నెల కాకముందే ఊడిపోతున్న తలుపులు



ప్రకాష్‌నగర్ ఎస్సీ సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో నేలపైనే పడుకున్న విద్యార్థులు



అపరిశుభ్రంగా ఉన్న మరుగుదొడ్డి



మురుగు నిల్వ ఉండి దుర్గంధం వెదజల్లుతున్న విద్యార్థులు దుస్తులు ఉతుక్కునే ప్రాంతం

పాయకాపురం(విజయవాడరూరల్): కూటమి ప్రభుత్వం సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల వసతి సౌకర్యాలకు సంబంధించి పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తోంది. హాస్టళ్లలో కనీస మౌలిక సదుపాయాల కల్పన గురించి పట్టించుకోవడం లేదు. ప్రకాష్ నగర్ లోని సాంఘిక సంక్షేమ బాలుర హాస్టల్‌లో ప్రభుత్వ నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభమై నెలా 15 రోజులు గడుస్తున్నా విద్యార్థులకు బెడ్‌షీట్లు, కార్పెట్లు అందజేయక పోవడంతో విద్యార్థులు నేల పైనే నిద్రిస్తున్నారు. కొంతమంది విద్యార్థులు ఇంటి నుంచి తెచ్చుకున్న చాపలపై నిద్రిస్తున్నారు. అసలే వర్షాకాలం...గచ్చుపై పడుకోవడంతో చల్లగా ఉండి చలికి వణికిపోతున్నారు. సరైన సదుపాయాలు లేక ముగ్గురు విద్యార్థులు మధ్యలోనే ఇళ్లకు వెళ్లిన పరిస్థితి. ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ, డిగ్రీ, ఇంజినీరింగ్ విద్యార్థులు 77 మంది హాస్టల్‌లో చదువుతున్నారని వార్డెన్ ప్రసాద్ తెలియజేశారు. ప్రభుత్వం విద్యార్థులకు ట్రంక్ పెట్టెలను మాత్రం అందజేసింది. ఇంత వరకు వైట్, రూల్స్ నోట్ పుస్తకాలను ఇవ్వలేదని విద్యార్థులు చెప్పారు. అవసరమైన వారు సొంత డబ్బులతో కొనుక్కుంటున్నారు. విద్యార్థులకు అవసరమైన కంప్యూటర్లు 7 వుండగా వాటిలో ఒక్కటి మాత్రమే పని చేస్తోంది. మిగిలిన ఆరు రిపేర్ రావడంతో మూలన పడేశారు.

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

మరమ్మతు చేసి నెలకాక ముందే తలుపులు ఊడుతున్నాయి...

హాస్టల్‌లో రూ.15 లక్షలతో తలుపులు మరమ్మతులు చేయించారు. అయితే మరమ్మతు చేసి నెల కాకముందే తలుపులు ఊడిపోతున్నాయి. దోమలు విలయతాండవం చేస్తున్నాయి. తలుపులకు గాని, కిటికీలకు గాని దోమలు రాకుండా దోమ తెరలు ఏర్పాటు చేయకపోవడంతో విద్యార్థులు దోమలతో నిద్రకు దూరం అవుతున్నారు. దోమ తెరలు ఏర్పాటు చేయాలని ఇటీవల హాస్టల్స్ వార్డెన్స్‌తో జిల్లా కలెక్టర్ సమావేశంలో కొందరు వార్డెన్లు చెప్పినా పట్టించుకోవడం లేదని విద్యార్థులు అంటున్నారు. హాస్టల్ ఆవరణలో వాటర్ ట్యాంక్ మూతబడటంతో మురుగునీరు నిల్వ వుండి దోమల నిలయంగా మారింది. నిల్వ వున్న మురుగునీరు నుంచి దుర్వాసన వస్తోంది. ఆ ట్యాంక్ రిపేరు చేయడానికి వర్క్ ఆర్డర్‌లో లేనందున మరమ్మతులకు నోచుకోలేదు. ఫ్యాన్లు రిపేరులో వుండటంతో మూడు పని చేయడం లేదు. ఆరు బయట విద్యుత్ దీపం లేకపోవడంతో విద్యార్థులు చీకట్లోనే భోజనాలు చేస్తున్నారు. టాయిలెట్స్‌లో నీరు సరఫరా కావడంలేదు. హాస్టల్‌లో ముగ్గురు పని మనుషులు వుండాల్సి ఉండగా, ఒక్క పని మనిషి వుండటంతో పని భారం అధికంగా వుండి కొన్ని సందర్భాల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం చేయాల్సిన వంటలను చేయలేక పోతున్నారు. వాచ్‌మన్ వంటలు చేస్తున్నాడు. దీంతో ఆహారపదార్థాల నాణ్యత ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

నిరంతరాయంగా డీసిల్టింగ్ పనులు చేయాలి



కృష్ణవేణి క్లాత్‌మార్కెట్ వద్ద డ్రైన్లో జరుగుతున్న డీసిల్టింగ్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్

పటమట(విజయవాడతూర్పు): నగరంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న డ్రైన్లలో నిత్యం డీసిల్టింగ్ పనులు జరగాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. నగర పర్యటనలో భాగంగా ఆయన శనివారం బందర్ రోడ్, నిర్మల కాన్వెంట్ రోడ్, పిన్నమనేని పాలీ క్లినిక్ రోడ్, ఎన్టీఆర్ సర్కిల్, ఏలూరు రోడ్, వన్ టౌన్ లో బ్రిడ్జి, బీఆర్టీ రోడ్డు, నెహ్రూ రోడ్, పంజా సెంటర్, కృష్ణవేణి క్లాత్ మార్కెట్ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన వర్షాకాలం నేపథ్యంలో రోడ్డుపైన నీటి నిల్వలు ఉండకుండా ఉండేందుకు నగరంలో మాన్సూన్ రెస్పాన్స్ టీం (వర్షాకాల స్పందన బృందం) ఏర్పాటు చేసినప్పటికీ, డీసిల్టింగ్ పనులు నగరంలో నిరంతరాయంగా జరుగుతుండాలని అన్నారు. డీవీ మేనర్ రోడ్డు వద్ద ప్యాచ్ వర్క్ చేయాలని, గుంతలను త్వరగా పూడ్చాలని అన్నారు. నగరంలో వీధి వ్యాపారస్తులకు జోనింగ్ పూర్తిస్థాయిలో చేసి వారికి జోన్‌లను ఏర్పాటు చేయాలని అన్నారు. పాడైపోయిన ఫుట్‌పాత్‌లను త్వరగా మరమ్మతులు చేయాలని, జమ్మి చెట్టు సెంటర్‌లో వర్షపు నీరును బందర్ రోడ్డు వైపు మళ్లించేందుకు చర్యలు తీసుకునేటట్టు ఇంజినీరింగ్ అధికారులు ప్రణాళికను సిద్ధం చేయాలని ఆదేశించారు. సైన్ బోర్డులను ప్రతి చోట అమర్చాలని, ప్రతి జంక్షన్ సంపూర్ణంగా కనపడేలా సైన్ బోర్డులను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయమని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. లో బ్రిడ్జి పాడైపోవడం గమనించి ఇంజినీరింగ్ అధికారులు త్వరగా మరమ్మతులు చేపట్టాలని, ఇరిగేషన్ శాఖాధికారుల సమన్వయంతో పనులు పూర్తిచేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

నగర సమగ్రాభివృద్ధిలో ఎన్ఆర్‌వీలు భాగస్వాములు కండి

కలెక్టర్ లక్ష్మీశ



ఎన్ఆర్వీలు, సిద్ధార్థ కళాశాల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ నగర సమగ్రాభివృద్ధిలో నాన్ రెసిడెంట్ విజయవాడయన్స్) భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో శనివారం కలెక్టర్ జి.లక్ష్మీశ ఎన్ఆర్‌వీలతో పాటు పీబీ సిద్ధార్థ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ అలుమ్ని అసోసియేషన్ ప్రతినిధులతో విజయవాడ నగర అభివృద్ధి, పీ4 విధానంపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆధ్యాత్మిక, సాంస్కృతిక, సాహిత్య, పర్యాటక కేంద్రంగా విరాజిల్లిన విజయవాడకు కొత్త వైభవం తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోందని, ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా వైబ్రెంట్ విజయవాడకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. విజయవాడ అభివృద్ధికి అందరి సలహాలు, సూచనలతో ముందుకు వెళుతున్నామన్నారు. నగరానికి ఓ బ్రాండ్ తీసుకొచ్చేలా కృషిచేస్తున్నామని, బ్రాండ్ టైటిల్, ట్యాగ్‌లైన్ కోసం ఇప్పటికే ఔత్సాహికుల నుంచి ఎంట్రీలు ఆహ్వానించామన్నారు. ప్రస్తుత పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా యువతలో నైపుణ్యాల వృద్ధికి, ఉపాధి సృష్టికి, ఉద్యోగాల కల్పనపై ప్రత్యేకంగా దృష్టిసారించామన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రజల ఆరోగ్య భద్రత లక్ష్యంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని పటిష్టంగా అమలుచేస్తున్నామని, క్లీన్ ఎయిర్ ప్రాజెక్టులను కూడా చేపట్టినట్లు కలెక్టర్ వివరించారు. దసరా ఉత్సవాల సమయంలో విజయవాడ ఉత్సవ్‌ను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. పేదరిక నిర్మూలనకు అమలు చేస్తున్న పీ4 విధానంలో మార్గదర్శులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. బంగారు కుటుంబాల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధి, ఉపాధి, స్వయం ఉపాధి, ఆరోగ్య అవసరాలు వంటివాటి విషయంలో మార్గదర్శులు చేయూతనిచ్చి, పేదరికం నుంచి బయటపడేలా చేస్తారని.. ఎన్ఆర్‌వీలతో పాటు పీబీ సిద్ధార్థ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ అలుమ్ని అసోసియేషన్ కూడా బంగారు కుటుంబాలకు మార్గదర్శులుగా ముందుకు రావాలని కోరారు. కలెక్టర్ విజ్ఞప్తి మేరకు ఎన్ఆర్‌వీలు సానుకూలంగా స్పందించారు. ఎన్ఆర్‌వీలు పి.సురేష్, వై.మణిధర్, హర్షసాయి, పీబీ సిద్ధార్థ కళాశాల పూర్వ విద్యార్థుల అసోసియేషన్ ప్రతినిధులు స్వరూప్, ఎ.ప్రశాంత్ చౌదరి, జీఎస్‌సీ బోస్, సుమబిందు అట్లూరి తదితరులు పాల్గొన్నారు.

కూటమి మోసాలు ప్రజల్లోకి తీసుకువెళ్లండి

- సెంట్రల్ నియోజకవర్గంలో బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ
- పార్టీ నాయకులు, కార్యకర్తలకు మల్లాది విష్ణు పిలుపు



చంద్రబాబు మ్యానిఫెస్టోను గుర్తుకుతెస్తూ పోస్టర్‌లను ప్రదర్శిస్తున్న మల్లాది విష్ణు, పార్టీ నాయకులు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఇచ్చిన హామీలను అమలు చేయలేదని, కూటమి ప్రభుత్వ మోసపూరిత హామీలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని మాజీ ఎమ్మెల్యే, సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మల్లాది విష్ణు అన్నారు. స్థానిక సత్యనారాయణపురంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ పేరుతో శనివారం డివిజన్ నాయకులతో విస్తృత సమావేశం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న మల్లాది విష్ణు మాట్లాడుతూ కూటమి నేతలకు ప్రజల ముందుకు వెళ్లే ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సంక్షేమంతో పాటు అభివృద్ధికి కూడా పెద్ద పీట వేశారని, సత్యనారాయణపురంలో జరిగిన అభివృద్ధి పనులే ఇందుకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో స్థానిక 33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణిమూర్తి, డివిజన్ ఇన్‌చార్జి దోనేపూడి శ్రీనివాస్, నాయకులు మైలవరపు రామకృష్ణ, బోగాది మురళి, లంకా బాబు, టి.గోపాల్, చాంద్‌శర్మ, సనత్, సీతారామ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బీసీల మహాధర్నా జయప్రదం చేయాలి



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బీసీ హక్కుల పరిష్కారం కోసం జాతీయ స్థాయిలో ఆగస్టు 18, 19వ తేదీలలో ఢిల్లీలో జరిగే మహా ధర్నాకు బీసీలందరూ వేలాదిగా తరలిరావాలని పలువురు బీసీ నేతలు పిలుపునిచ్చారు. చిట్టినగర్‌లోని శ్రీనగరాల మహాలక్ష్మీ అమ్మవారి ఆస్థాన కల్యాణ మండపంలో బీసీ సంక్షేమ సంఘ నేతలు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం ఏపీ ఇన్‌చార్జి వై.నూకాలమ్మ, రాష్ట్ర అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు, జనరల్ సెక్రటరి కనిశెట్టి లక్ష్మణరావు, లీగల్ సెల్ సలహాదారు పిళ్లా శ్రీనివాసరావు, పలువురు నేతలు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ సంఘ జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద మహా ధర్నా నిర్వహించనున్నామన్నారు. బీసీలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, బీసీ హక్కుల సాధనకు చేపట్టిన ధర్నాలో వేలాదిగా పాల్గొనాలని కోరారు. సమావేశంలో సంఘ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నమ్మి భానుప్రకాష్, బాడిశ రూపేష్, తమ్మిన దుర్గారావు, పీసా అరుణ్‌కుమార్, సత్యాల సతీష్, జి.లీల పాల్గొన్నారు.

ప్రేమించకపోతే చంపేస్తా!

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ప్రేమించకపోతే చంపేస్తానంటూ బెదిరించిన యువకుడిపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సింగ్‌నగర్ డంపింగ్ యార్డ్ సమీపంలోని జీ ప్లస్‌త్రీ ఇళ్లల్లో నివసిస్తున్న గోవిందరాజు ఆటోడ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. ఇతనికి ముగ్గురు కుమార్తెలు. రెండో కుమార్తె ఇటీవలే డిగ్రీ పూర్తి చేసి ఇంటివద్దే ఉంటుంది. అదే ప్రాంతానికి చెందిన పువ్వుల చందన అనే వ్యక్తి గత కొన్ని నెలల నుంచి ప్రేమ పేరుతో ఆమె వెంట పడుతూ వేధిస్తూ ఉండేవాడు. రెండు నెలల క్రితం యువతి తల్లిదండ్రులు, స్థానిక పెద్దలు పిలిచి హెచ్చరించారు. అయినా అతడు యువతి ఇంటి బయటకు వచ్చినా, బజారు వెళ్లినా వెంటబడి తనను ప్రేమించాల్సిందేనని, లేకపోతే చంపేస్తానని బెదిరిస్తున్నాడు. దీంతో భయభ్రాంతులకు గురైన యువతి విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పడంతో వారు పోలీసులను ఆశ్రయించారు. యువతి ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హనుమాన్ గుప్తా సామాజిక సేవలు వెలకట్టలేనివి



హనుమాన్ గుప్తా సంస్మరణ సభలో పాల్గొన్న వివిధ సంస్థల ప్రతినిధులు

విజయవాడ కల్చరల్: కళాపోషకుడు, సాంస్కృతిక సంస్థ నిర్వాహకుడు హనుమాన్‌గుప్తా సామాజిక సేవలు వెలకట్టలేనివని కామ్రేడ్ జీఆర్‌కే సాహితీ సమితి వ్యవస్థాపకుడు గోళ్ళ నారాయణరావు అన్నారు. సాంస్కృతిక కళా సంస్థల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని సంస్థ కార్యాలయంలో శనివారం హనుమాన్ గుప్తా సంస్మరణ సభ నిర్వహించారు. నారాయణరావు మాట్లాడుతూ గుప్తా కళాకారుల సంక్షేమానికి కృషి చేశారని, పేద కళాకారులకు నిత్యావసరాలను అందించేవారన్నారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు మాట్లాడుతూ గుప్తా గాయకునిగా దేశంలోని వివిధ ప్రాంతాలలో అనేక ప్రదర్శనలు ఇచ్చారని, నూతన గాయనీ గాయకులను తన సంస్థ ద్వారా వేదికమీద ప్రదర్శనకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. సంస్మరణ సభలో వివిధ సంస్థల ప్రతినిధులు పరుచూరి విజయలక్ష్మి, కె.డేవిడ్‌రాజు, టీవీ వీరభద్రరావు, బోడి ఆంజనేయరాజు, డి.చంద్రశేఖర్, కె.రాజు తదితరులు హనుమాన్ గుప్తాతో తమ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. తొలుత హనుమాన్ గుప్తా చిత్ర పటానికి నివాళులు సమర్పించారు.

డొంక రోడ్డులో అవుట్‌ఫాల్ కచ్చా డ్రెయిన్ పనులు ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్



దావు బుచ్చయ్యకాలనీ డొంక రోడ్డులో కచ్చా డ్రెయిన్ పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ జానారెడ్డి

మధురానగర్(విజయవాడసెంట్రల్): దావు బుచ్చయ్యకాలనీ డొంక రోడ్డులో అవుట్‌ఫాల్ కచ్చా డ్రెయిన్ పనులు శనివారం ప్రారంభించారు. దావు బుచ్చయ్యకాలనీలో మురుగునీరు బయటకు పోయే మార్గం లేదు. దీంతో ఎవరికి వారు వారు వాడిన మురుగు, వర్షపునీటిని ఖాళీ స్థలాలలోకి వదిలివేస్తున్నారు. దీంతో స్థానికులు పడుతున్న అవస్థలు వివరిస్తూ సాక్షి దినపత్రిక శుక్రవారం చికుకుపడితే చిత్తడే శీర్షికన కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన స్థానిక కార్పొరేటర్ అధికారులతో మాట్లాడి వర్షపు నీరు, మురుగు బయటకు పోయే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందుకుగానూ దావు బుచ్చయ్యకాలనీ డొంక రోడ్డులో అవుట్‌ఫాల్ కచ్చా డ్రెయిన్‌ను నిర్మించాలని నిర్ణయించారు. అధికారులతో కార్పొరేటర్ జానారెడ్డి మాట్లాడి జేసీబీతో డ్రెయిన్ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా జానారెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా కచ్చాడ్రెయిన్‌ను నిర్మించనున్నట్లు తెలిపారు. అయితే కచ్చా డ్రెయిన్ వల్ల తమకు రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందని క్రాస్ రోడ్డు ప్రజలు విన్నవించుకోగా, రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా డ్రెయిన్ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. దావు బుచ్చయ్యకాలనీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు అర్జా వెంకటేశ్వరరావు, మధు, శంకర్, ప్రసాద్, రవి పాల్గొన్నారు.

దసరా ఉత్సవ ఏర్పాట్లపై సమీక్ష

క్యూలైన్లు, స్నానఘాట్లు, కనకదుర్గనగర్‌లో పరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దసరా ఉత్సవాల ఏర్పాట్లపై దుర్గగుడి ఈవో శీనానాయక్ శనివారం ఆలయ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మహామండపంలోని నాల్గో అంతస్తులో ఈవో ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశానికి ఆలయ ఏఈవోలు, సూపరింటెండెంట్లు, ఇంజినీరింగ్ అధికారులు, ఆలయ అర్చకులు హాజరయ్యారు. తొలుత ఆలయ ఈవో శీనానాయక్, ఇంజినీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. వీఎంసీ కార్యాలయం, సీతమ్మ వారి పాదాలు, స్నానఘాట్లతో పాటు కనకదుర్గనగర్‌ను పరిశీలించారు. ఉత్సవాల నేపథ్యంలో ఏర్పాటు చేసే క్యూలైన్లు, ప్రసాదాల కౌంటర్లు, వీఐపీ టికెట్ కౌంటర్ల గురించి ఆలయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం టోల్‌గేట్, ఓం టర్నింగ్, ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసే క్యూలైన్ల గురించి అధికారులతో చర్చించారు.

అధికారులతో సమీక్ష

దసరా ఉత్సవాల ఏర్పాట్లపై ఈవో సమీక్ష సమావేశం నిర్వహించారు. గతంలో ఉత్సవాల నేపథ్యంలో చేసిన ఏర్పాట్లు, భక్తుల సంతృప్తిపై చర్చించారు. అమ్మవారి దర్శన వేళలతో పాటు వీఐపీ, సిఫార్సు లేఖలపై వచ్చే వారి గురించి కూడా ప్రస్తావించారు. ఈ ఏడాది దసరా ఉత్సవాలలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా భక్తులకు సదుపాయాలను కల్పించాలని, 29వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగే సమావేశానికి కార్యచరణ రూపొందించాలని ఆదేశించారు. సమీక్ష సమావేశంలో ఆలయ ఏసీ రంగారావు, ఏఈవోలు ఎన్.రమేష్‌బాబు, వెంకటరెడ్డి, ఈఈలు, ఏఈవోలు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

డ్రైన్లపై ఆక్రమణలు తొలగించాలి



డ్రైన్లను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

పటమట(విజయవాడతూర్పు): నగరంలో డ్రైన్లపై ఆక్రమణలను తొలగించాలని మంత్రి పొంగూరు నారాయణ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన నగరంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రైన్ల ఆక్రమణలను వెంటనే మార్కింగ్ చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గుణదల పుల్లేటికట్ట, దర్శిపేట, ఫకీరు గూడెంలో అవుట్ ఫాల్ డ్రైన్లు, బెంజిసర్కిల్ ఫ్లై ఓవర్ దిగువన వర్షం నీరు నిల్వ ఉండే ప్రాంతాలతో పాటు ఆటోనగర్ లోని వీఎంసీ శాటిలైట్ స్టేషన్‌ను మంత్రి నారాయణ పరిశీలించారు. కొన్ని చోట్ల డ్రెయిన్లు వెడల్పుగా ఉండగా, మరికొన్ని చోట్ల ఇరుకుగా ఉండటంపై అధికారులను వివరణ అడిగారు. చాలా ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణాలతో పాటు ప్రహరీగోడలు అవుట్ ఫాల్ డ్రెయిన్లను ఆక్రమించి నిర్మించడాన్ని గుర్తించి అవుట్ ఫాల్ డ్రెయిన్ల ప్రవాహానికి ఇబ్బందిగా మారిన అక్రమ కట్టడాలు తొలగించాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్రను ఆదేశించారు. ఆక్రమణలు ఉన్న ప్రాంతాల్లో స్థానిక ప్రజాప్రతినిధులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని, ఎవరైనా ఇళ్లు కోల్పోతుంటే వారికి టిడ్కో ఇళ్లను కేటాయించాలని అధికారులను ఆదేశించారు. వీఎంసీ, సీఆర్డీయే నిధులతో విజయవాడలో డ్రైనేజీ వ్యవస్థ మెరుగు చేస్తామని, సెప్టెంబర్ నుంచి పనులు ప్రారంభించి 6 నెలల్లో పూర్తి చేసి వచ్చే వర్షాకాలం నాటికి విజయవాడ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని మంత్రి నారాయణ తెలిపారు. బుడమేరు ఆక్రమణలపై ఇరిగేషన్ శాఖ సాంకేతిక కమిటీని నియమించిందని, ఆ కమిటీ త్వరలో నివేదిక ఇస్తుందన్నారు. బుడమేరును వెడల్పు చేయడమా లేదా గట్లు ఎత్తు పెంచడమా అనే దానిపై కూడా టెక్నికల్ కమిటీ పరిశీలిస్తుందన్నారు. విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఇరిగేషన్ అధికారులతో సమన్వయం చేసుకుని త్వరలో ఓ నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. ఈ పర్యటనలో ప్రజారోగ్య విభాగం ఇంజినీర్ ఇన్ చీఫ్ ప్రభాకర్, వీఎంసీ చీఫ్ ఇంజినీర్ శ్రీనాథ్ రెడ్డి, ఇతర ఇంజినీర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నేత్ర పర్వంగా సాగిన లయాన్విత నృత్య ప్రదర్శన



సిద్ధార్థ కళాపీఠంలో చెన్నైకు చెందిన సాయిప్రసన్న బృందం లయాన్విత నృత్య ప్రదర్శన

విజయవాడ కల్చరల్: ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం ఆధ్వర్యంలో నెల వారీ కార్యక్రమంలో భాగంగా శనివారం మొగల్రాజపురంలోని సిద్ధార్థ కళాపీఠం మీద ప్రదర్శించిన తకిట తత్ ఝం ప్రత్యేక నృత్య ప్రదర్శన నేత్రపర్వంగా సాగింది. క్రిపాస్ సెంటర్ ఫర్ ఫైన్ ఆర్ట్స్ సంస్థ నిర్వాహకురాలు నాట్యాచారిణి సాయి ప్రసన్న బృందం ప్రదర్శించిన లయాన్విత నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. రంగాధిదేవతను ప్రార్థిస్తూ తకిట తత్ ఝం పేరుతో భరతనాట్య సంప్రదాయంలో మనోహరంగా సాగింది. అభినయ మణివన్నన్, ఏజీ అమృత జయవర్షిణి, ఎన్.మాయ, జేకే నిఖిత, విజయరాఘవన్, ప్రార్థన ప్రసన్న, సంహిత కన్నన్, డి.సంజన, ఎన్.స్నేహ,శ్రీనిధి అయ్యర్, పి. సుందరేశన్ నృత్యాలను అభినయించారు. కళాపీఠం సాంస్కృతిక విభాగం కార్యదర్శి బీవీఎస్ ప్రకాష్, కళాపీఠం బాధ్యుడు తాతినేని శ్రీనివాసరావు కళాకారులను సత్కరించారు. కళాశాల తెలుగు విభాగం అధ్యాపకులు డాక్టర్ సశ్రీ కార్యక్రమాన్ని నిర్వహించారు.

నగరంలో నటి తేజశ్వి సందడి



షోరూంను ప్రారంభిస్తున్న సినీ నటి తేజస్వి

లబ్బీపేట(విజయవాడతూర్పు): నగరంలో సినీ నటి తేజశ్వి సందడి చేసింది. ఎంజీ రోడ్డులో బెంజిసర్కిల్ సమీపంలో ఏర్పాటుచేసిన ఇకోలక్స్ డైమండ్ జ్యూవెలరీ షోరూమ్‌ను శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమెను చూసేందుకు అభిమానులు పెద్ద సంఖ్యలో విచ్చేశారు. కార్యక్రమంలో సేవా భారతి సంయుక్త కార్యదర్శి నాగలక్ష్మి పాఠి, ఫిక్కీ ఫ్లో సభ్యురాలు లలితా పాఠి, కస్టమర్ కోర్టు సభ్యురాలు దారా కరుణశ్రీ, డేటా అనలిస్టు సౌజన్య కంచర్ల ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు. ప్రారంభోత్సవం సందర్భంగా ఈ నెలాఖరు వరకూ ప్రత్యేక ఆఫర్లు ఉన్నట్లు నిర్వాహకులు సిద్ధాంత్ సంఘ్వీ, ప్రతీక్ కోఠారి తెలిపారు.